బాబు మోసాలను ఎండగడదాం

- సమస్యలపై శాంతియుత పోరాటం చేస్తాం
- కార్యకర్తలకు వెన్నంటే ఉంటా
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి





పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రొద్దుటూరు : కూటమి ఏడాది పాలనలో ఎన్నికల హామీలు అమలు చేయకుండా చంద్రబాబు సహా ఆ పార్టీ నేతల మోసాలను ఇంటింటికీ వెళ్లి ప్రజల వద్ద ఎండగడదామని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం మండల కేంద్రమైన రాజుపాళెంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ, చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు నాగేంద్రారెడ్డి అధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఏ ఒక్క హామీని చంద్రబాబు ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. కరెంటు బిల్లులు పెరగవని, నాణ్యమైన కరెంట్‌ను ఇస్తామని చెప్పి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే కరెంట్ చార్జీలను పెంచారని, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గిస్తామని చెప్పి రెండింతలు పెంచారన్నారు. జగన్ ఇచ్చిన పథకాలన్నీ ఇవ్వడంతోపాటు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. పైగా జగన్ అప్పులు తెచ్చి పథకాలు అమలు చేస్తున్నారని తాను సంపద సృష్టిస్తానని చెప్పారన్నారు. చేనేతలకు రూ.24వేలు పథకం అమలు చేయలేదన్నారు. రజకులు, నాయీబ్రాహ్మణులకు ఏ పథకాలు అమలు కావడం లేదని, వలంటీర్ల వ్యవస్థ లేదన్నారు. సచివాలయ వ్యవస్థను ప్రభుత్వం నీరుగార్చిందని విమర్శించారు.

5 లక్షల పింఛన్లు రద్దు

చంద్రబాబు అధికారంలోకి వచ్చాక కొత్త పింఛన్లు ఇవ్వకపోగా రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల పింఛన్లను రద్దు చేశారని రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు, ఐఆర్ ఇవ్వలేదని, వేతనాలు చెల్లింపులో ఆలస్యమవుతోందన్నారు. జాబ్ క్యాలెండర్ అమలు కాలేదని విమర్శించారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలకు సంబంధించి వ్యక్తిగతంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ బాండ్లు ఇచ్చారని, ఆ బాండ్లు ఇప్పుడు చెల్లకుండా పోయాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నేతల విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని రాచమల్లు స్పష్టం చేశారు. వార్డు మెంబర్ నుంచి జెడ్పీటీసీ ఎన్నిల వరకు అందరిని గెలిపించేందుకు ఆర్థికంగా కూడా చేయూతనందిస్తానని భరోసా ఇచ్చారు. సమస్యలపై శాంతియుత పోరాటం చేయాల్సిన అవసరం వస్తుందని, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని తెలిపారు. 2014, 2019 ఎన్నికల్లో రాజుపాళెం మండలంలో తనకు మంచి మెజారిటీ వచ్చిందని, గడిచిన ఎన్నికల్లో సైతం మూడు పార్టీలు ఏకమైనా పెద్ద మెజారిటీని వారు తెచ్చుకోలేకపోయారన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలపై వైఎస్సార్‌సీపీ తయారు చేసిన క్యూఆర్ కోడ్‌ను తయారు చేస్తే వివరాలు అన్ని వస్తాయన్నారు. ఈ సందర్భంగా బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ, చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ.. క్యూఆర్‌కోడ్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఎస్‌ఏ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాజుపాళెం మండల అధ్యక్షుడు బాణా కొండారెడ్డి, జెడ్పీటీసీ అంజనీకుమారి, గోపల్లె సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మెట్టుపల్లె ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీపీఐ కౌన్సిల్ సభ్యుల ఎన్నిక



పి.చంద్రశేఖర్



డి.ప్రమీల

ప్రొద్దుటూరు : సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ప్రొద్దుటూరుకు చెందిన సీపీఐ నాయకులు పి.చంద్రశేఖర్, డి.ప్రమీల, ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి పీటర్‌లను ఎన్నికైనట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రామయ్య, పి.సుబ్బరాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బద్వేలులో జరిగిన సీపీఐ 25వ మహాసభలలో వీరిని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నట్లు వారు పేర్కొన్నారు. జిల్లా మహాసభల్లో కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం కోసం, ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు, అపెరల్ పార్కుల్ ఏర్పాటుకు, ప్రొద్దుటూరులో పరిశ్రమల ఏర్పాటుకు ఉద్యమించాలని తీర్మానాలు చేసినట్లు వారు వివరించారు.

కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా ప్రసాదరెడ్డి



నూతన అధ్యక్షుడు ప్రసాదరెడ్డికి నియామక పత్రం అందిస్తున్న ఎంపీడీఓ

పోరుమామిళ్ల : మండలంలోని పంచాయతీ కార్యదర్శులు గురువారం ఎంపీడీఓ అధ్యక్షతన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా ప్రసాదరెడ్డి, గౌరవ అధ్యక్షుడుగా ఓబులేసు, కోశాధికారిగా రవీంద్రారెడ్డి, ఉపాధ్యక్షులుగా సరిత, వెంకట సురేంద్ర, కార్యదర్శులుగా హరికృష్ణ, సంజీవరెడ్డి ఎన్నికయ్యారు. ఎంపీడీఓ ఉపేంద్రారెడ్డి కార్యదర్శుల నూతన కమిటీని అభినందించారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా ఎస్ఎండీ మౌలానా



నూతనంగా ఎన్నికైన పంచాయతీ కార్యదర్శుల సంఘం

చాపాడు : పంచాయతీ కార్యదర్శుల సంఘం చాపాడు మండల అధ్యక్షుడిగా ఎస్ఎండీ మౌలానా నియమితులయ్యారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద గురువారం మండలంలోని పంచాయతీ కార్యదర్శుల సంఘం సాధారణ సమావేశం జరుపుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎస్ఎండీ మౌలానా, జాయింట్ సెక్రెటరీగా చంద్రశేఖర్, ట్రెజరర్‌గా జ్యోత్స్న, కమిటీ సభ్యులుగా శ్రీనివాసులరెడ్డి, లక్ష్మీప్రసన్నలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మండలంలోని అందరూ పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన శ్రీనివాసులు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని నెల్లూరు రోడ్డులో గల పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో గురువారం ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. గోపవరం మండలం పెద్ద గోపవరం గ్రామానికి చెందిన శ్రీనివాసులు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా ఐలమ్మకాలనీకి చెందిన మల్లి ఆటో తోలుకుంటూ వెళుతుండగా పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోకి వచ్చేసరికి రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో శ్రీనివాసులుకు, మల్లికి ఇరువురికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఇరువురిని ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న ఏడీఏ కృష్ణమూర్తి

మైదుకూరు(చాపాడు) : ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని దీనిపై రైతుల్లో అవగాహన కల్పించాలని ఏడీఏ కృష్ణమూర్తి పేర్కొన్నారు. మైదుకూరులోని తెలుగుగంగ కాలనీలోని డీఎల్ఆర్‌సీ కార్యాలయంలో గురువారం మైదుకూరు వ్యవసాయ డివిజన్ పరిధిలోని రైతు సేవా కేంద్రం సిబ్బందికి పకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. రైతులు పకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపేలా ప్రోత్సహించాలని సూచించారు. కడప డీఆర్సీ ఏడీ పద్మజ మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం చేయడం వలన భూమిలో సేంద్రియ కర్బనం అధికంగా పెరుగుతుందని, భూమిలో ఉపయోగకరమైన సూక్ష్మజీవులు పెరుగుతాయని, సారవంతమైన నేలను తరువాతి తరాలను అందించవచ్చన్నారు. ఉద్యానశాఖ అధికారి రామకృష్ణ, వ్యవసాయాధికారి బాలగంగాధర్‌రెడ్డి, చాపాడు మండల వ్యవసాయాధికారి దేవిపద్మలత, టెక్నికల్ ఏఓ సంతోషి, ఏపీసీఎన్ఎఫ్ మాస్టర్ ట్రైనర్స్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలి



మాట్లాడుతున్న వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటసుబ్బయ్య

అట్లూరు : ప్రకృతి వ్యవసాయాన్ని గ్రామ స్థాయి నుంచి విస్తరించాల్సిన ఆవశ్యకత ఉందని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. బద్వేలు మండల పరిధిలోని చింతలచెరువు రైతు సేవాకేంద్రంలో గురువారం ప్రకృతి వ్యవసాయం పై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పాత పద్ధతులు విడనాడి కాలానుగుణంగా ఏక పంట అనే విధానానికి స్వస్తి పలికి పలు పంటల సాగు విధానానికి మొగ్గు చూపాలన్నారు. పలు పంటల సాగు విధానం వలన రైతులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేలు, గోపవరం, అట్లూరు మండలాల వ్యవసాయ అధికారులు అరుణ, విజయారావు, రామకృష్ణయ్య, ఉద్యాన వన అధికారి జయ భరత్‌రెడ్డి, ఏఈఓలు, వీఏఏలు, ఎంపీఈఓలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి



కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి

బి.కోడూరు : కీటక జనిత వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సబ్ యూనిట్ అధికారి టి.నరసింహారెడ్డి తెలిపారు. గురువారం బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బి.కోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డెంగ్యూ మాసోత్సవాల సందర్భంగా కీటక జనిత వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియా వంటి జబ్బుల గురించి అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు దోమల పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని, దోమతెరలు వాడాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఎటువంటి జ్వరాలు వచ్చినా వెంటనే పీహెచ్‌సీకి వచ్చి రక్తపరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పుష్పాంజలి, హెల్త్ సూపర్‌వైజర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయులు సువర్ణజ్యోతి, శేఖర్, ఏఎన్ఎం భారతి, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నెరవేర్చలేదు



మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ ఎం.రామగోవిందరెడ్డి

బ్రహ్మంగారిమఠం : ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ పూర్తిగా నెరవేర్చలేదని జెడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి తెలిపారు. గురువారం బి.మఠంలో మండలస్థాయి వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బాబు షూరిటీ, మోసం గ్యారంటీ అనే కార్యక్రమంలో శనివారం ఉదయం 10 గంటలకు బ్రహ్మంగారిమఠం రెడ్ల అన్నదాన సత్రం కల్యాణ మండపంలో భారీగా కార్యకర్తల సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశంకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, పార్టీరాష్ట్ర క్రమశిక్షణ అధ్యక్షుడు, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ముఖ్యఅతిథులుగా వస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రతి వైఎస్సార్ కార్యకర్త, నాయకుడు తమవంతుగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మేకల రత్నకుమార్‌యాదవ్, మండల సింగల్ విండో మాజీ అధ్యక్షుడు నేలటూరు సుబ్బారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న మురళీధర్‌రెడ్డి

పోరుమామిళ్ల : హరిత విప్లవంలో భాగంగా విచక్షణా రహితంగా రసాయన మందులు, రసాయన ఎరువులు వాడడం వల్ల క్షీణించిన భూమిని, విష తుల్యమైన గాలిని ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా కాపాడుకోవచ్చని వ్యవసాయ సంచాలకులు మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం రంగసముద్రం రైతుసేవా కేంద్రంలో పోరుమామిళ్ల వ్యవసాయ డివిజన్‌లోని 5 మండలాల రైతు సేవ సహాయకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంలో రాజీలేని సూత్రాలను రైతులకు వివరించి రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపేలా ప్రోత్సహించాలన్నారు. ఉద్యానాధికారి శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ రైతులు ఏకపంట విధానానికి స్వస్తి పలికి పలుపంటల విధానానికి వెళ్లాలన్నారు. ఇందువల్ల రైతులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయాధికారులు పవన్, చంద్రమోహన్‌రెడ్డి, చంద్రమోహన్, కౌశిక, ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు నరసింహారెడ్డి, శ్రీలక్ష్మి, వీరనారాయణ, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత ప్రొద్దుటూరుకు సహకరించండి



మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు : ప్లాస్టిక్ రహిత ప్రొద్దుటూరుకు వ్యాపారులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి కోరారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్, స్వచ్ఛభారత్, జాతీయ గ్రీన్ ట్రిబునల్ వారి ఆదేశాల మేరకు మున్సిపాలిటీలోని ప్రతి సచివాలయంలో ఒక టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. టాస్క్‌ఫోర్స్ కమిటీ వారు వారి సచివాలయ పరిధిలో ఉన్న వ్యాపారులకు ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్లాస్టిక్ నిషేధం గురించి అవగాహన కల్పిస్తారన్నారు. 120 మైకాన్ల కంటే తక్కువ మందం గల క్యారీబ్యాగ్‌లను, గ్లాస్‌లను, టీ కప్‌లను వాడకూడదన్నారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను విక్రయించినా, వినియోగించినా అపరాధ రుసుం విధిస్తామని, ఉత్పత్తులను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. ప్లాస్టిక్ నిషేధంపై శనివారం సాయంత్రం 4.30 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశ భవనంలో స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారస్తులతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశానికి ప్రజలు, వ్యాపార సంస్థలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరై సచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

గ్రామస్తులపై కుక్కల దాడి



గాయపడిన రామకృష్ణారెడ్డి

రాజుపాళెం : మండల పరిధిలోని కొట్టాల గ్రామంలో కుక్కల బెడద తీవ్రతరంగా మారింది. గురువారం కొట్టాల గ్రామంలో ప్రజలపై పిచ్చి కుక్క దాడి చేసింది. అలాగే దారిన వెళుతున్న వారిపై ఇష్టం వచ్చినట్లుగా కుక్క కరిచి గాయాలు చేసింది. ఈ సంఘటనలో కాసా రామకృష్ణారెడ్డి, ఒక మహిళ మరో ముగ్గురు కుక్క దాడిలో గాయపడ్డారు. దగ్గరలోని నంద్యాల జిల్లా మండల కేంద్రమైన చాగలమర్రిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని ర్యాబిస్ టీకాలను వేయించుకున్నారు. గతంలో ఇదే గ్రామంలో జీవాల దొడ్డిపై కుక్కల గుంపు దాడి చేసి రైతుకు తీవ్ర నష్టాన్ని కలగజేశాయి. ప్రజలు జీవాలపై కుక్కల బెడద లేకుండా గ్రామ పంచాయితీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా పల్లవోలు రమణ

చాపాడు : భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ)కడప జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా మండలంలోని పల్లవోలు గ్రామానికి చెందిన పల్లవోలు రమణ ఎన్నికయ్యారు. ఈనెల 22, 23వ తేదీలలో బద్వేలు పట్టణంలో జరిగిన సీపీఐ జిల్లా మహాసభల్లో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా

బద్వేలు అర్బన్ : నమ్మిన విలువల్ని, సిద్ధాంతాల్ని తన రచనల ద్వారా నిక్కచ్చిగా ప్రకటించిన నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి శ్రీనివాస వర్మ, సీనియర్ దళిత నాయకులు ఓ.ఎస్.వి.ప్రసాద్ పేర్కొన్నారు. జాషువా వర్ధంతిని పురస్కరించుకుని గురువారం ప్రజా సంఘాల ఐక్యవేదిక కార్యాలయంలో జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకుడు కేశవయ్య, పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి పిచ్చయ్య, మదర్‌థెరిసా ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రసాద్, లిడ్‌క్యాప్ మాజీ డైరెక్టర్ రాజశేఖర్, ఎమ్మార్పీఎస్ నాయకులు బాలస్వామి, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ లీడర్‌షిప్ క్వాలిటీని పెంపొందించుకోవాలి

చాపాడు : కళాశాలలో బోధించే ఫ్యాకల్టీ, హెచ్ఓడీలు ప్రతి ఒక్కరూ తమలోని లీడర్‌షిప్ క్వాలిటీని పెంపొందించుకోవాలని బెంగళూరుకు చెందిన ఆర్‌వీ యూనివర్సిటీ ఎన్ఎల్‌పీపీ లీడర్‌షిప్ ట్రైనర్ లోగశక్తి కందస్వామి తెలిపారు. స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)లో గురువారం హెచ్ఓడీ, ఫ్యాకల్టీలకు లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. సీబీఐటీ డైరెక్టర్ అడ్మిన్ జి.శ్రీనివాసులరెడ్డి, డైరెక్టర్ ప్రసన్నవెంకటేశ్, ప్రిన్సిపాల్ ఎస్.శృతి తదితరులు పాల్గొన్నారు.

అభినందన



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గురుమోహన్‌ను సన్మానిస్తున్న డాక్టర్ కల్యాణ చక్రవర్తి

పోరుమామిళ్ల: బద్వేలుకు చెందిన సింగసాని గురుమోహన్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన సందర్భంగా ఆప్కాస్‌బోర్డు మాజీ మెంబర్ డాక్టర్ కళ్యాణ చక్రవర్తి గురువారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. గురుమోహన్‌కు పూలదండ, శాలువా వేసి అభినందనలు తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి పార్టీలో మంచి భవిష్యత్తు ఉంటుందని కళ్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీ దేవి జయంత్యుత్సవం


- అమ్మవారికి ప్రత్యేక పూజలు



ప్రొద్దుటూరు : రామ్‌నగర్‌లో విశేష అలంకరణలో అమ్మవారు



రాజుపాళెం: పూజలు అందుకుంటున్న చౌడేశ్వరి



కాశినాయన : ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరిదేవి



ప్రొద్దుటూరు : చీర, సారె, కలశాలను ఊరేగిస్తున్న దేవాంగులు

ప్రొద్దుటూరు కల్చరల్ : చౌడేశ్వరిదేవి జయంతి ఉత్సవాలను గురువారం పట్టణంలోని పలు ఆలయాల నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది. అన్ని చౌడేశ్వరిదేవి ఆలయాల వద్ద భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. స్థానిక సుబ్బిరెడ్డి కొట్టాలలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి క్యూలో నిలిచారు. సుబ్బిరెడ్డి కొట్టాలలోని చిన్నచౌడేశ్వరిదేవి ఆలయంలో, వసంతపేటలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. ఆర్టీపీపీ రోడ్డులోని అష్టభుజ మహాచౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారిని సుందరంగా అలంకరించారు. భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. స్థానిక వినాయకనగర్‌లోని చౌడేశ్వరిదేవి ఆలయంలో, ఆర్ట్సు‌కళాశాల రోడ్డులోని చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, జపహోమాదులతో పాటు భక్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మోతుకూరి వెంకటసుబ్బయ్య, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవికి చీర సారె సమర్పణ

శ్రీచౌడేశ్వరిదేవి జయంతి సందర్భంగా తమ కుల దేవత అయిన చౌడేశ్వరిదేవికి దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవాంగ కులస్తులు ఊరేగింపుగా వెళ్లి చీరసారె సమర్పించారు. దేవాంగ సంక్షేమ సంఘం, ఆలయ అధ్యక్షుడు వృట్టి నాగశయనం, దేవాంగ కల్యాణ మండపం, సంక్షేమ సంఘం, రామలింగ చౌడేశ్వరిదేవి ఆలయ ప్రతినిధులు రెడ్డి చంద్రశేఖర సుబ్రహ్మణ్యం, మచ్చా వెంకటసుబ్బరాయుడు, వృట్టి లక్ష్మీనారాయణ, గిద్దలూరు ఈశ్వరయ్య, గిద్దలూరు శ్రీనివాసులు, కాటం వీరప్రసాద్, పోసా శివప్రసాద్ పాల్గొన్నారు.

రాచమల్లు పూజలు

ప్రొద్దుటూరు : చౌడేశ్వరిదేవి జయంతిని పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి గురువారం చౌడేశ్వరీనగర్‌లోని చౌడేశ్వరిదేవి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గరిశపాటి లక్ష్మీదేవి, వరికూటి ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి రామేశ్వరంలో, చౌడేశ్వరినగర్‌లలో ఉన్న చౌడేశ్వరి ఆలయాలను సందర్శించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, కౌన్సిలర్ పాతకోట మునివంశీధర్‌రెడ్డి, యువజన విభాగం దార్శల గురునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా వేడుకలు

రాజుపాళెం : మండల పరిధిలోని పర్లపాడు గ్రామంలో గురువారం చౌడేశ్వరి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారిని శాకాంబరి దేవీ అలంకరంలో (కూరగాయలు) శోభాయమానంగా అర్చకుడు రవి అలంకరించారు. అనంతరం ఆయా గ్రామ మహిళలు, ప్రజలు, యువకులు వచ్చి అమ్మవారిని దర్శించుకొని కాయాకర్పూరం సమర్పించి పూజలు చేశారు. అనంతరం అమ్మవారి చీరలను వేలం వేయగా పలువురు భక్తులు వాటిని దక్కించుకున్నారు. అక్కడకు వచ్చిన వారందరికి ఆలయ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి జయంతి

కాశినాయన : మండలంలోని ఆకుల నారాయణపల్లె గ్రామంలో చౌడేశ్వరిదేవి జయంతిని గురువారం తొగటవీరక్షత్రియుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన మహిళల కోలాటం అందరిని ఆకట్టుకుంది.

దుస్తుల పంపిణీ



విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

కాశినాయన : పోరుమామిళ్ల చిత్తా శౌరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో, ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, థామస్ రెడ్డి దంపతులు గురువారం మండలంలోని వంకమర్రి, ఇటుకలపాడు, కోడిగుడ్లపాడు, నరసాపురం జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదువుతున్న 631 మంది విద్యార్థులకు నూతన దుస్తులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ప్రసాద్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'ఉపాధి'

- డ్వామా పీడీ ఆది శేషారెడ్డి



ఉపాధి పనుల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

రాజుపాళెం : కూలీలకు ఉపాధి హామీ ద్వారా పనులు కల్పించడమే కాకుండా గ్రామాల్లో రైతులకు మినీ గోకులం సదుపాయాలను కల్పించడం జరిగిందని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఆదిశేషా రెడ్డి తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో గురువారం 19వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదికలో పాల్గొన్న డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ పనుల్లో అలసత్వం వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పథకం ద్వారా మంజూరు చేసిన పనులను పటిష్టంగా నిర్వహించాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. 2024-25 మార్చి నెల వరకు జరిగిన పనులను సోషల్ ఆడిట్ సిబ్బంది ద్వారా పరిశీలింలించామని పేర్కొన్నారు. ఆ నివేదికలను బహిరంగ సమావేశం ద్వారా తెలియజేయడం జరిగిందన్నారు. ఈ పనుల్లో ఏవైనా తేడాలు జరిగి ఉంటే ఆ సొమ్మును రికవరీ చేయడమే కాకుండా అందుకు సంబంధించిన సిబ్బందిపై చర్యలు ఉంటాయని తెలిపారు. రాజుపాళెం మండలంలో రూ.9.35 కోట్ల పనులకు గాను ఈ సోషల్ ఆడిట్‌ను నిర్వహించడం జరిగిందన్నారు. అందులో రోడ్లు రైతుల మినీ గోకులాలు పూడిక తీత పనులు కూలీలకు పనులు కల్పించడం మెటీరియల్ ఉంటాయన్నారు. అన్ని గ్రామ పంచాయితీల ఉపాధి పనుల నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించారు. వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, ఎంపీడీఓ రామనాథరెడ్డి, డ్వామా అడిషనల్ పీడీ రామలింగేశ్వర రెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి జుబేదా, సోషల్ ఆడిట్ స్టేట్ టీం మెంబర్ కోనయ్య, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి విజయ భాస్కర్, డీఆర్‌డీఏ ఏపీడీ వెంకటేశ్వర ప్రసాద్, పీఆర్ డీఈ లక్ష్మీనారాయణ రెడ్డి, ఏపీఓలు లక్ష్మీనారాయణ, వసంత కుమార్, ప్రజా ప్రతినిధులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.